# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 14, అక్టోబరు, 2014

హైదరాబాద్‌తో సహ తెలంగాణలోని ఐదు ప్రధాన నగరాల అభివృద్ధి బాధ్యతను స్వయంగా తానే తీసుకుంటానని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. సచివాలయంలో మంగళవారం ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆయా నగరాల అభివృద్ధిపై చర్చించారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, రేపటి తెలంగాణలో కీలక నగరాలుగా మారుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈ నగరాల ప్రణాళికబద్ధమైన అభివృద్ధి జరగాల్సి వుందన్నారు. రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ నగరంలోనే డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా వుందని, అసెంబ్లీ, రాజ్‌భవన్, సిఎం నివాసాల ముందే చిన్న వర్షం పడినా నీళ్లు ఆగిపోతున్నాయని చెప్పారు. నాలాలు కబ్జాకు గురయ్యాయని అన్నారు. పరిస్థితిని చక్క దిద్దాలంటే 10 వేల కోట్ల రూపాయలు అవసరమని అధికారులు అంచనా వేశారని అన్నారు. మిగతా నగరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అక్కడ కూడా సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఖమ్మంలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థ లేదని, కరీంనగర్, నిజామాబాద్ నగరాల్లో అండర్ డ్రైనేజి వ్యవస్థ బాగా లేదని అన్నారు. నగరాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వుందన్నారు. హైదరాబాద్ తరువాత వరంగల్ నగరం అతిపెద్ద ప్రాంతమని అక్కడ కూడా సమగ్ర అభివృద్ధి జరగాలన్నారు. తెలంగాణ వాటర్ గ్రిడ్ ద్వారా అన్ని నగరాలకు మంచినీరు అందివ్వనున్నట్లు వెల్లడించారు. బడ్జెట్ సమావేశాల తరువాత తానే స్వయంగా ఈ నగరాలను సందర్శిస్తానని, సమస్యలు స్వయంగా చూసి పరిష్కార మార్గాలు కనుగొంటానని వెల్లడించారు. ఖమ్మం పట్టణం చుట్టు ప్రక్కల ప్రాంతాలకు బాగా విస్తరిస్తోందని, అక్కడ నగర స్వరూపం కూడా మారుతోందని దానికనుగుణంగా ప్రణాళికలు

సిద్ధం చేస్తామని వెల్లడించారు.   ఖమ్మం పట్టణం సరిహద్దులు రఘునాథ పాలేం, కొణిజెర్ల, వైరా, చింతకాని తదితర మండలాలకు విస్తరిస్తున్నదని చెప్పారు. నల్గొండ పట్టణం కూడా బాగానే విస్తరిస్తోందని అక్కడ కూడా మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాల్సి వుందన్నారు. నగరాల్లో ప్రతి మనిషికి రోజుకు 135 లీటర్ల చొప్పున మంచినీరు అందించడం, రహదార్లు, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి తదితర అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు.  రామగుండం మాదిరిగానే కొత్తగూడెం కూడా అభివృద్ధి చెందుతున్నదని, అక్కడ నాలుగువేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ వస్తుందని, దీనివల్ల దాదాపు 10 వేల మందికి ఉద్యోగ అవకాశం కలుగుతుందని చెప్పారు. కొత్తగూడెంలో టౌన్‌షిప్ అభివృద్ధి చెందుతుంది కాబట్టి జాగ్రత్తగా నగరాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు.

-----------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం